# 'తెప్ప మీద తేలిపోదాం పదరా'

రచయిత:

తోలేటి గంగాధరము, ఎం. ఏ.

"ఇంతలో ఊరునుంచి లక్ష్మీదేవిభర్త వచ్చేడని కబురువచ్చింది. భర్తవచ్చేడన్నమాట వినడంతోటే ఉత్సాహంలో లక్ష్మీదేవి తాను పద్మావతితో చెబుతూవున్నవాక్యం పూర్తిచెయ్యకుండానే వెళ్ళిపోయింది. లక్ష్మీదేవి మగనిలాగే తనమగడుకూడా అప్పుడువస్తే ఎంత బాగుండును! పోనీ మగనిదగ్గరనుంచి వుత్తరమేనా వస్తే చాలు."

౧

డాక్టరికి ఏమీ పాలుపోవడంలేదు. ఆమె అతనితో ఏదో చెపుతూవుండగా అతను తల ఊపుతూవున్నాడు.

'సరే! ప్లాటుఫారంమీద అతన్ని ఆన మాలు పట్టేనని అనుకున్నట్లయితే అతణ్ణి ఎందుకు పలకరించలేదు' అని అడిగాడు.

పద్మావతి ఆయాసపడుతూవుంది. జరిగిన సంగతంతా ఇంతక్రితమే డాక్టరుకు తెలిసే లాగున పూసగుచ్చినట్లు చెప్పివుంది.

'నేను మాట్లాడాలనే అనుకున్నాను. కాని నాకు చాలాభయంవేసింది.' అని ఆమె నెమ్మదిగా అన్నది. 'తీరా మాట్లాడదామని గుండె నిబ్బరంచేసుకునేసరికి నేను ఎల్లా వున్నానో రైల్లోవున్నాను. ప్లాటుఫారంమీదనుంచి రైలుపెట్టెలోకి ఎల్లా వెళ్లేనో, ఎప్పుడు వెళ్లేనో నాకు తెలియదు. ఆయనమాత్రం ప్లాటుఫారంమీదే వుండిపోయారు. ఆయ నేదో నాకు చెప్పేరు. కాని ఆమాటలు నాకు వినిపించలేదు.'

డాక్టరు మళ్ళీ తల వూపేడు.

'ప్లాటుఫారంమీద వున్నాడని నీవు అనుకునేమనిషి ప్లాటుఫారము మీద లేడు. ఇదిఅంతా నీజబ్బులక్షణం. హిస్టీరియా అనేజబ్బు. ఆజబ్బు ఎన్నిపోకడలేనా పోతుంది. ఆమనిషి నీమనస్సులోమాత్రమే వున్నాడు. నీభర్తఅయిన ఆవ్యక్తిని ఆప్లాటుఫారంమీదచూశినాననీ, అతను ఏదో నీతో మాట్లాడాడనీ నీకు బాగా నమ్మకంగావుంది అనే సంగతినాకు తెలుసు. కాని, అమ్మాయీ! ఇదిఅంతా వట్టిభ్రాంతి. అంతా నీజబ్బులక్షణం కాక మరోటికాదు. వైద్యవృత్తిలో నాతల నెరిసిపోయింది. మరిన్ని ఇటీవల నేను ఎన్నో హిస్టీరియావ్యాధుల్ని కుదిర్చివున్నాను. కాబట్టి నీవు నామాటల్ని పూర్తిగా విశ్వసించాలి. ఇల్లాంటికేసులు ఎన్నో నేను చూశివున్నాను. మూడునాలుగు నెలల్లో నీజబ్బు నెమ్మదించిన తరవాత ఆమనిషివిషయం అంతా భ్రాంతి అని నేను చెప్పినసంగతి నిజమనేసంగతి నీకే తెలుస్తుంది.'

లోతుపట్టరాని నిరుత్సాహాన్ని నిశ్వసించే

దీర్ఘమైన నిట్టూర్పువిడిచి ఆమె అవృద్ధ వైద్యుణ్ణి తేరిచూచింది. ఎంత ఆయాసంగా వున్నా తాను ఇంతిసేపటినుంచీ చెప్పిన సంగతులు డాక్టరుకు ఏమీ బోధపడలేదని పద్మావతి అనుకుంది. ఆసంగతులు మళ్ళీ జాగ్రత్తగా చెప్పడానికి పూనుకుంది.

'డాక్టరుగారూ! నేనుచెప్పిన సంగతులు మీకు కొంచెంకూడా బోధపడలేదని నాకు తోస్తుంది. ఈవిషయంలో భ్రాంతిఅనేది నాకు ఎంతమాత్రం లేదు. నేను నాకళ్ళతో స్పష్టంగా ఆయన్ని చూశాను. కొద్దిరోజు లేనా కాపరం చేయకపోయినా ఆయన్ని గూర్చి నేను భ్రాంతిపడ్డానంటే అది నమ్మరానిసంగతి. ఆయన గుండ్రనిముఖం, విశాల నేత్రాలూ, ఎర్రటి పెదవులూ మరిచిపోవాలన్నా నాకు మరుపుకురావు. ఈవేళటికి సరిగ్గా ఐదేళ్లు అయింది మా పెళ్ళిఅయి. నేను మొదటవెళ్లేసరికి ఆయన ప్లాటుఫారంమీద లేరు. రైలు రాకకోసం నిరీక్షిస్తూ నేను ప్లాటుఫారంమీద తారట్లు ఆడుతూవున్నాను. కొంతసేపటికి ఆయన అక్కడకూర్చుని వుండడం నాకు కనిపించింది. ఆయన పరుపు చుట్టా, సూటుకేసు ప్రక్కనే వున్నాయి. నేను వెనకముఖంగా పచారుచేస్తూ వున్నప్పుడు వచ్చి ఆయన అక్కడ కూర్చుని వుండాలి——'

డాక్టరు మధ్యలో అందుకున్నాడు: 'నాకు బాగా బోధపడ్డది. ఇది మూడోసారి నీవు చెప్పడం. అతని కళ్లల్లో నీకు ఏదో విడ్డూరపు చూపు కనిపించింది. భయపడ్డావు. అయినా అతనితో మాట్లాడాలని నీకు కుతూహలం కలిగింది. అతనితో మాట్లాడడానికి ధైర్యం తెచ్చుకోవాలనే ప్రయత్నంలో నీవు అటూ ఇటూ పచారుచేస్తున్నావు. అతను నీకేసి నిదానించిచూడ్డం, నిన్నుపిలవడం నీకు తెలుసు. అయినా నీకు భయంవేసింది. ఇంతలో రైలువచ్చింది. ఆసంగతి నీకు తెలియకుండానే నీవు రైలుఎక్కావు. రైలు కదులుతూవుండగా అతను ఏదో మాట్లాడబోయినట్లు అతని పెదవులు కదిలాయి. అతని కంఠస్వరం నీకు వినిపించిందికాని అతను ఏమి చెప్తున్నాడో మాత్రం నీకు తెలియలేదు. ఇంతేనా ?'

పద్మావతి అవునన్నట్లు తలవూపింది.

'అమ్మాయీ! మనస్సులో ఆలోచించుకో-నీవు చెప్పేవిషయం ఎంత అసంభవంగా వుందో. చదువుఅయితేగాని కార్యంచేసుకోనని పట్టుపట్టిన అతను ఆరునెలలక్రితం మదరాసులో బి. యల్ క్లాసు చదువుతూ మోటారుబస్సుప్రమాదంలో చనిపోయాడని నీవే నాతో ఇదివరకు చెప్పివున్నావు. అప్పటికి బ్రతికివున్న మీ అమ్మకూడా నీబాల్యవైధవ్యానికి గుండెలు కొట్టుకుంది. ఆరునెలల క్రితం చనిపోయిన అతను ఇప్పుడు రైలు ప్లాటుఫారంమీద కనిపించేడంటే నమ్మతగిన విషయమేనా? అతని చావు ఆనాటి వార్తాపత్రికల్లో పడిందాయెను! అతని తల్లిదండ్రులు వచ్చి నిన్ను పరామర్శకూడా చేశిపోయారాయెను! ఇంకా ఎందుకు వెఱ్ఱిపడతావు, తల్లీ! ప్లాటుఫారంమీద అతను నీకు ఎల్లా కనిపిస్తాడు ?'

ఆమె డాక్టరుకేసి కొరకొరా చూశింది.

'డాక్టరుగారూ! మీకు ఇంకా బోధపడలేదు. సరిగ్గా ఈవేళకి ఐదేళ్లు అయింది మా పెళ్ళిఅయి. ఆయనికి నేనంటే ఎంతో ప్రేమ. ఏపండక్కివచ్చినా ఆయన నాకోసం మద్రాసునుంచి ప్రత్యేకంగా ఏదోవకటి తెస్తూనే వుండేవారు. సరిగ్గా ఈవేళకి మాపెళ్ళిఅయి

ఐదేళ్లుఅయింది కాబట్టే ఆయన నన్నుచూడ్డానికని అక్కడికి వచ్చేరు. పాపిష్ఠిదాన్ని. నాకు ఆయనతో మాట్లాడేధైర్యం లేకపోయింది. మాట్లాడివుంటే ఈసారి నాకు ఆయన ఏమి బహుమానం చేశేవారో!'

వృద్ధవైద్యుడు తిరిగి చెప్పడానికి ప్రారంభించేడు :

'అమ్మాయీ! నేనుచెప్పేది విను. నామాటలంటే కొంచెం గుఱివుంచు. ఇప్పుడు నీవు చెప్పినవిషయం నీకంటె నాకు బాగా బోధపడ్డదని నీవు అంగీకరించితీరాలి. అతను చనిపోయాడని నీకు తెలుసు. మీఅమ్మ అతని మరణవార్త విన్నప్పటినుంచీ మంచంపట్టి మరణించింది, లేక లేక పుట్టిన ఒక్క కొడుకూ మరణించేడని నీ అత్తమామలు సమస్తమూ వదిలేసి కాశీ లేచిపోయారు. పోతూపోతూ వచ్చి నిన్ను చూశిపోయారు. ఇవన్నీ మినాహాయింపులులేని సత్యాలని నీకు నేను వేఱేచెప్పవలసిన పనిలేదు. ఇక అతను ప్లాటుఫారముమీద నీకు ఎల్లా కనిపిస్తాడు? ఇది అంతా నీమనస్సుకు పట్టిన భ్రాంతిఅనుకో. నీమనస్సు చాలా ఉద్రేకంగావుంది ఐదు అవడంతోటే రైలుమీద రాజమండ్రివెళ్లు. సినీమా చూడు. తిరిగి తొమ్మిదిగంటలబండిలో వచ్చేయి. మాఅమ్మాయిని కూడా తీసుకువెళ్ళు. కులాసాగా కబుర్లు చెప్పుకోండి. ఈవేళ ప్రొద్దున రాజమండ్రి ప్లాటుఫారముమీద జరిగినవని నీవు అనుకునేసంగతులన్నీ మరిచిపో. సినీమాచూడ్డంతోటే తిరిగి ఇక్కడికి వచ్చేయండి. రాజమండ్రిలోకంటే కొవ్వూరులో గాలి పరిశుభ్రంగావుంటుంది. నీవంటివారికి శుభ్రమైనగాలి ఎంతేనా అవసరం. రాత్రి రాజమండ్రినుంచి వచ్చినతర్వాత కళ్ళు బాగా మూసుకువచ్చేవరకు హార్మోనీ వాయించు. రాత్రి బాగా నిద్రపట్టిందంటే ఉదయానికి నీకు స్వస్థచిత్తంకలుగుతుంది.'

డాక్టరు చెప్పేవన్నీ వట్టి చేదస్తపుమాటలని ఆమెకు తోచింది. అనాదరమందస్మితం చేశింది. మూడునెలలుగా అతను తనని రోజూ తలఅంటుకోమనీ, రోజూ సంగీతసాధన చేయమనీ, నాటకాలకు వెళ్ళమనీ, సినీమాలకు వెళ్ళమనీ, ఒంటరిగా కూర్చోవద్దనీ, అస్తమానూ చెలికత్తెలతో కబుర్లుచెబుతూవుండమనీ నిర్బంధిస్తూవున్నాడు. ఈడాక్టర్లు ఇంత తెలివిమాలిన మూర్ఖులేమా అని అనుకుంది. ఏసినీమాకుపోయినా ఒక నాయకుడు, నాయక — తెరమీద ముద్దులు, చెవులో మాటలు. తాను, తన మధుసూదనరావు జ్ఞాపకం వస్తారు. గ్రామఫోను పెట్టుకుందామంటే తనవద్దఉన్న ప్లేట్లుఅన్నీ స్త్రీపురుషప్రేమను తలపించేవే! ఏదేనా నవల చదువుదామంటే నవల్లనిండా వలపుగోడవే! చెలికత్తెలతో మాట్లాడుతూవున్నా వాళ్ళ సంభాషణల్లో అప్పుడప్పుడు ప్రణయసంబంధమైన హాస్యాలు వస్తూవుంటాయి. చిత్తం అన్యథాయత్తం చేసుకోడానికి చేసే ఈప్రయత్నాలన్నీ మానుపట్టిన పుండుమీది తొక్కను వూడతీసి పుండుమాన్పడానికి ప్రయత్నించడంలాగున వుంటుంది. అయినా ఆమె డాక్టరు చెప్పినదానికి అంగీకరించింది. వాళ్ళ అమ్మాయిని పంపిస్తానని చెపుతూ అతను వెళ్ళిపోయినాడు.

౨

డాక్టరుగారి కూతురు, పద్మావతి చెలికత్తెఅయిన లక్ష్మీదేవి వచ్చింది. కాని పద్మావతికి ఆవేళ సినీమాకిపోవడం ఇష్టంలేకపోయింది. మేడమీదకుపోయి గోదావరివైపుకు ఉన్న గదిలో కూర్చున్నారు. అప్పుడే కనుచీకటి పడుతూవున్నది. గోదావరి అవతలఒడ్డున

ఉన్న పేపరుమిల్లు పొగగొట్టం స్పష్టంగా కనిపిస్తూవుంది. రాజమండ్రి గోదావరి గట్టున ఉన్న ఎలక్ట్రిక్ దీపాలుకూడా కనిపిస్తున్నాయి. ఒకనాడు తన్నూ, తనతల్లినీ తీసుకుని వెళ్ళి మధుసూదనరావు పేపరుమిల్లూ, ఎలక్ట్రిక్ పవర్ హౌసూ చూపించేడు. ఆనాడు పేపరు మిల్లుదగ్గరా, పవర్ హౌస్ దగ్గరా బండిలోనుంచి దిగేటప్పుడు తనచెయ్యి పద్మావతికి ఊతం ఇచ్చేడు. అతనివలని స్పర్శసుఖం ఆమెకు అంతే.

ఆరోజు జ్ఞాపకంవచ్చింది. ఆమె కళ్ళ వెంబడి నీళ్లు సంతతధారగా కురుస్తూ వున్నాయి. లక్ష్మీదేవి ఏదో ఊరుడింపుమాటలు చెబుతూవుంది. ఇంతలో ఊరునుంచి లక్ష్మీదేవి భర్త వచ్చేడని కబురువచ్చింది. భర్తవచ్చేడన్నమాట వినడంతోటే ఉత్సాహంతో లక్ష్మీదేవి తాను పద్మావతితో చెబుతూవున్నవాక్యం పూర్తిచెయ్యకుండానే వెళ్ళిపోయింది.

పద్మావతికి ఈపరిస్థితి మరింత దుర్భరమైన మానసిక వేదనాన్ని కలిగించింది. లక్ష్మీదేవి మగనిలాగే తనమగడుకూడా అప్పుడు వస్తే ఎంతబాగుండును ? పోనీ, మగనిదగ్గరనుంచి వుత్తరమేనా వస్తే చాలు.

మేడమీదనుంచి క్రిందకిదిగివచ్చి సావిట్లో ఉత్తరాలపెట్టెలో చూశింది అందులో ఉత్తరాలు ఏమన్నా పడివున్నాయేమో అని. ఉత్తరంలేదు, ఉద్ధరీలేదు.

3

మళ్ళీ మేడమీదకు వెళ్ళింది. ఇంట్లోదీపం వెలిగించాలనే జ్ఞానం ఆమెకు ఇప్పటికి కలిగింది. దీపంవెలిగించి ఆమె పడకకుర్చీలో వాలింది. కళ్లుమూసుకుంది. దీపంకాంతి సన్న సన్నగా మూతలువడ్డ ఆమె కనురెప్పలమీద నాట్యంచేస్తూవుంది.

ఆమె కళ్లుతెరచి చూశేసరికి ఎదురు గుంజా మంచంమీద తనభర్త మధుసూదనరావు కూర్చునివున్నాడు. విలాసంగా తన్ను చూస్తూవున్నాడు. నవ్వుముఖంమీద అతని కళ్లు నాట్యంచేస్తూవున్నాయి. పాలకంటె తెల్లనైన అతని దంతపంక్తిమీద తాను వెలిగించిఉంచిన దీపపుకాంతి ప్రస్ఫుటంగా పడుతూవుంది.

'పద్మా! ఏమిటి ధ్యానిస్తున్నావు?' అని మధుసూదనరావు అడిగేడు.

ఆమె అతనికేసి నిర్ఘాంతపోయి చూశింది. ఆపాదమస్తకం ఆమె ఒక్కసారి భయంచేత కంపితురాలయింది. అయినా మాట్లాడడానికి ఎట్లో గొంతు పెగలతీసుకుంది.

'మధుసూదనా! మధుసూదనా! మీరేనా?' అన్నది. మగణ్ణి పేరుతో పిలిచినందుకు ఆమె సిగ్గుతో కుంచింపబడ్డది.

'ఇంకా ఎవళ్లేనా వస్తారనుకుంటున్నావా?' అని అతను అడిగేడు. కలకలనవ్వేడు. చాలాకాలంక్రిందట విన్న మనోహరమైన కీర్తన మళ్ళీ చెవినిపడ్డట్టు ఆమె ఆనందించింది.

'మధుసూదనా! నిజంగా మీరు మధుసూదనరావుగారు కారని నానమ్మకం. నానమ్మకం నిజంగా అంతే. మీరు మధుసూదనరావుగారు కారు.' అని ఆమె అంది.

అతడు మళ్ళీ కలకల నవ్వేడు. తెల్లని అతని పలువరుస ఆదీపపుకాంతిలో తేజరిల్లింది. 'అయితే! నేను మరిఎవర్ని?' అని అతను ప్రశ్నించేడు.

'మీరు మధుసూదనరావుగారే! మధుసూదనరావుగారే! మధుసూదనరావుగారు కారూ?'

'బాగావుంది, పద్మా! బాగావుంది! ఓ దెయ్యాన్నో భూతాన్నో అనుకుని అక్కడ కూచుని నాకేసి పూరికే నిర్ఘాంతపోయి చూడకు. కాస్త తాగడానికి మజ్జిగ తేటో, నిమ్మరసమో, మంచినీళ్లో పట్టుకురా!' అని అన్నాడు అతను.

పద్మావతికి ప్రాణాలు లేచివచ్చేయి. ఉన్మత్తంగా ఉత్సాహం కలిగింది. లేచి అతని దగ్గరకు వెళ్లింది. అతనిమొగం చెమటతో చెమ్మగిలివుంది. ఆమె అతన్ని ముద్దుపెట్టుకుంటూవుండగా అతనిముంగురులు చెదిరి ఆ మొకళ్లకు అడ్డంపడ్డాయి.

'నిన్ను చూడ్డానికి రావాలని ఎన్నిసార్లో ప్రయత్నించాను, పద్మా!' అని నెమ్మదిగా అన్నాడు.

'నిజంగానా? మధుసూదనా!'

'ఈవేళపొద్దున్న రాజమండ్రీప్లాటుఫారం మీద నువ్వు కనిపించేవు. నాతో మాట్లాడుతావని అనుకున్నాను. ఏం, పద్మా! నన్ను పలకరించేవే కావు.'

'అయితే మధుసూదనా! ప్లాటుఫారం మీద కనిపించింది మీరే అన్నమాట?'

'ఏం? పద్మా! ఈవేళ నీకు అడుగడుక్కీ సందేహాలే తోస్తున్నాయి? నిజంగా నేనే. నాతో మాట్లాడితే నోటిముత్యాలు రాలిపోతాయి అనా ఏమిటి రైలుఎక్కి వెళ్లిపోవచ్చావు?'

పద్మావతి అతనికేసి తేరిపారి చూసింది. అతనికళ్లూ, ఆమెకళ్లూ వియ్యమందినాయి. తనవేళ్లతో అతనిచెక్కిలి నిమిరింది.

'మధుసూదనా! నేనేమో భ్రాంతిపడుతున్నానని డాక్టరుగారు అంటున్నారు. కాని, నాకు తెలుసు; నేను కొంచెం చొరవచేసివుంటే నీవు నాతో మాట్లాడివుందువు.'

మధుసూదనుడు ఆమెభుజంమీద చెయ్యివేసి పట్టుకున్నాడు నెమ్మదిగా ఇట్లా చెప్పినాడు :

'పద్మా! చాలారోజులనుంచి నీదగ్గరకు రావాలని అనుకుంటూ వున్నాను. నేనిప్పుడు చాలా అలసిపోయివున్నాను. తిరిగి రావడంఅంటే చాలాకష్టం. ఇప్పటికే చాలా నెలలు అయింది. నేను నిర్బంధిస్తునానని అనుకోక నీలో నీవు ఆలోచించుకొని తుది నిర్ణయానికి రా. నేను చెప్పేది జాగ్రత్తగా విను. విని తుదినిర్ణయం చెయ్యి. ఈనాటికి సరిగ్గా మనవివాహమై ఐదుఏళ్లు ఐంది. చదువు పూర్తిఅయితేకాని కార్యం చేసుకోనని మూర్ఖించేను. ఇటీవల మీఅమ్మకూడా మరణించింది. నిన్ను ఒంటరిగా వుంచడం నాకు ఇష్టంలేదు. నిన్ను తీసుకువెళ్లడానికి వచ్చేను. నీకు ఇష్టమైతేనే నిన్ను తీసుకువెళతాను. నాతోటి వచ్చెయ్యడానికి నీకు ఏమీ అభ్యంతరం లేకపోయినట్లుఅయితే నీవు వెంటనే నాతో వచ్చెయ్యాలి. నీకు చాలాభయం వెయ్యవచ్చు. ఇతనితో వెళ్లడానికి ఎందుకు ఒప్పుకున్నానా అని నీకు విచారం గలగవచ్చు. కాని నీతో నేను ఒకమాటమాత్రం చెప్పవలసివుంది. నేను ఇప్పుడు నిన్ను వదలివెళ్లిపోయానంటే తిరిగి రావడం చాలాదుస్తరం. నేను చాలాదూరప్రదేశానికి పోవలసివుంది.'

జవాబుగా పద్మావతి మధుసూదనునికంఠానికి తనరెండుచేతులు పెనవేసింది; గట్టిగా అతణ్ణి కాగలించుకుంది.

'మధుసూదనా! ఒక్కనిమిషం ఆగు. దారిలో తిండానికిగాను ఏమైనా మనచేతిసంచిలో వేసుకుని వస్తాను.'

మధుసూదనుడు నవ్వినాడు :

'వెఱ్ఱిదానా! నీకేమీ అక్కర్లేదు. ఉన్న పట్టున వచ్చేయి.' అన్నాడు.

'మధుసూదనా! అయితే, పద, త్వరగా పోదాం పద. నేను సిద్ధంగా వున్నాను.'

ఆదంపతులు లేచారు. ఆనాటిఉదయం రాజమంద్రిరైలుస్టేషనులో పద్మావతి చూచిన మాదిరిగా అతనిపరువుచుట్ట కట్టబడివుంది. సూటుకేసుకూడా అదేమాదిరిగా వుంది.

'పద్మా! భయపడనని వాగ్దానం చెయ్యి. నేను చెప్పినట్లల్లా చేస్తానని ఒట్టువెయ్యి.' అన్నాడు అతను.

'వాగ్దానం చేస్తున్నాను. ఇదిగో ఒట్టు కూడా వేస్తున్నాను.' అని ఆమె అంది.

అతనితో ఆమె పక్కగదిలోకి వెళ్లింది. ఆగదికి గోదావరివైపునఉన్న ఊచల్లేని పెద్ద కిటికీ తీసివుంది. మధుసూదనుడు ఆకిటికీలోకి ఎక్కి కూచున్నాడు.

'పద్మా! నేను సయ్ అంటాను. నాచెయ్యి గట్టిగా పట్టుకో. నీవూ నేనూ ఇట్లాగే పోదాము. ఏమీ భయపడకు. నాచెయ్యి మాత్రం గట్టిగా పట్టుకో. నిన్ను నేను తీసుకుపోతాను. నిన్ను నేను వదలిపెట్టనని నమ్ము.'

అతడు దొడ్డిలోకి తొంగిచూశాడు. ప్రక్కరోడ్డుమీదికి దృష్టి సారించాడు. అవతల ఉన్న ఇళ్లమీదికి చూపు బరిపాడు. దూరాన్నిఉన్న గోదావరిమీదికి దృష్టి పారించాడు. సయ్ అన్నాడు. ఆమె అతనిచెయ్యి గట్టిగా పట్టుకుంది. మేడమీద ఆగదిలో ప్రాణమున్నది యేదీ మరునిమిషాన్ని లేదు.

... ... ...

మధుసూధనుడు ఆమెను వదిలిపెట్టేశాడు

శాబోలు మఱునాడు ఉదయాన్ని కొవ్వూరు ప్రజలు సరిగ్గా ఆకిటికీక్రింద దొడ్లో పద్మావతి శవాన్ని చూశారు.

---

# తెలుగువారి మునిసిపాలిటీలు : వాటి జనాభా

[ఈ మునిసిపల్ పట్టణములకు వానివాని జనాభానుబట్టి వరుస నెంబర్లు ఈయబడినవి.]

| | | |
|---|---|---|
| 1. | కాకినాడ | 65,952 |
| 2. | గుంటూరు | 65,179 |
| 3. | రాజమండ్రి | 63,526 |
| 4. | బెజవాడ | 60,427 |
| 5. | ఏలూరు | 57,342 |
| 6. | విశాఖపట్టణం | 57,303 |
| 7. | బందరు | 56,928 |
| 8. | బళ్లారి | 47,578 |
| 9. | నెల్లూరు | 45,895 |
| 10. | విజయనగరం | 44,696 |
| 11. | ఆదోని | 35,635 |
| 12. | కర్నూలు | 35,314 |
| 13. | తెనాలి | 34,580 |
| 14. | అనకాపల్లి | 23,376 |
| 15. | నంద్యాల | 22,608 |
| 16. | కడప | 22,602 |
| 17. | చిత్తూరు | 22,018 |
| 18. | ప్రొద్దుటూరు | 20,124 |
| 19. | తిరుపతి | 19,138 |
| 20. | చీరాల | 18,853 |
| 21. | పెద్దాపురము | 17,338 |
| 22. | పాలకొల్లు | 16,906 |
| 23. | ఒంగోలు | 16,672 |
| 24. | చికాకోల్ | 16,588 |
| 25. | నరసారావుపేట | 15,403 |
| 26. | అనంతపురము | 15,099 |
| 26. | హిందుపురము | 14,211 |
| 28. | తాడిపత్రి | 12,620 |
| 29. | భీమునిపట్టణం | [illegible] |